# 16. జలగా-మనిషి

బ్రాంచి మేనేజరు నారాయణగారి ఆశపోతు తనానికి శేఖరానికి కోపం వొచ్చింది. అత నా కోపాన్ని దిగమింగుకోవలసీ వచ్చింది. ఏంచేస్తాడు, పేదవాడికోపం పెదవులకి చేటు. ఉద్యోగం కాస్తా వూడుతుంది.

కాని పద్మకి కోపం దిగమింగుకోవలసిన అవరం ఏమిలేదుగా! ఆవిడ శేఖరాన్ని "అసహాయస్థితి లో ఉన్నా'' నంటే అర్థం చేసుకొని సానుభూతి చూపించలేకపోయింది. "ఏమిటండీ, మీ, బ్రాంచి మేనేజరు దౌర్జన్యం? ముప్పొద్దులా చాకిరిచేయించుకుంటూ గూడా ఈ చేతికందిందల్లా పట్టుకుపోవడం ఏం రోగం?'' అంది.

"ఏం చేస్తాం?''

"ఏం చేస్తా మేమిటండీ, వాడికేనా బుద్ధుండాలి; మీకేనా ఉండాలి. అంత పట్టపగ్గా ల్లేకుం డానా? ఎవరు తలుపు కొట్టినా తట్టుకోగలంగాబట్టి సరి పోతోంది. లేకపోతే ఏమయ్యేట్టూ?''

"లేకపోతే ఆయన చెయ్యి జాపనే జాపడూ,'' అన్నాడు శేఖరం.

అతను ఇంటా బైటా కూడా ఆఫీసరుకి జవాబుదారీగా మాట్లాడితేనే పద్మకి మంట.

"జాపడు. అసలుసంగతి చెప్పేస్తే మీక్కోపం. మీరే అతని కా అలుసిచ్చేరు. మిగిలిన వాళ్లందర్నీ లేకే ఆయన పీక్కు తినడం లేదంటారా? మీ అన్నయ్యగారింటి పక్కనుండే రామారావుగారి పెళ్ళాన్ని కనుక్కున్నాన్నేను. ఇంకెవరిమీదా ఇలా నిత్య సవారీ లేదటే ?'' అంది పద్మ.

శేఖరం మాట్లాడలేదు.

అతను మాట్లాడలేడు.

బ్రాంచి మేనేజరు నారాయణగారు శేఖరానికి పినతండ్రి తోడల్లుడికి అన్నగారి కొడుకు దూరపు చుట్టం అనైనా అక్ష్యపెట్టక సెలక్షను కెళినప్పుడు శేఖరం ఎందుకేనా మంచిదని ఆయన్నీ 'చూశాడు.' చూసి నందుకు అయ్యో అని నారాయణగారు సమయంచూసి తను చెప్పవలసిన మాటలు నాలుగూ డైరెక్టరుగారితో చెప్పాడు. చెప్పి నందుకు శేఖరానికి పనైంది. ఉన్న ఊర్లో నూటముప్ఫయి రూపాయల ఆద్యోగం దొరికింది. పైగా చుట్టం అయిన నారాయణగారి చేతికిందనే దొరికింది.

"ఒహ ఆర్నెల్లపాటు కొత్తలో పనిలో లోటుపాట్లొచ్చినా నేను సవిరించుకు పోతాన్లే" అని నారాయణగారు హామీకూడా ఇచ్చారు. రెండుమూడుసార్లు ఆయనే సూచించగా వుద్యోగానికి ఆర్డరు రాకమునుపే నారాయణగారింటికి నువ్వుల బస్తా వొకటీ, ఒక చింతచెట్టు కర్రలూ చదివించుకున్నాడు శేఖరం. నువ్వుల్తోటీ కర్రల్తోటీ కొంత పీడొదిలిందిగదా అని సరిపుచ్చుకున్నారు శేఖరం దంపతులు, ఏదో అలా అనుకోవాలి గాబట్టి.

అంతతో పీడ వొదిల్తే బాగానే వుణ్ణు.

శేఖరానికి పంపకంలో వొచ్చిన వేమిటేమిటో అన్నీ నారాయణగారు తెలుసుకున్నారు. మామిడితోటా, చుట్టూ చింతచెట్లకోరడా. రెండు మూడెకరాలు కాలవకింది మాగాణీ, ఇంట్లో ఆయిదు కొబ్బరిచెట్లూ, దొడ్లో ఆవూ పాదులూనూ.

మొదటేడాది మామిడితోట్లోవి బుట్టెడు పళ్ళు"పిల్లలు తింటా" రని శేఖరం స్వయంగా పట్టించుకెళ్ళాడు. అంతే.

అక్కణ్ణించీ ఏది కావలసినా వారే కబురు చేసేవారు.

ధాన్యప్పంట నూర్పిడులై బస్తాల కెక్కించిన మూడో నాడు శేఖరాన్ని అయిదున్నర దాకా ఆఫీసులో వుంచేసి గదికి కబురెట్టారు. నారాయణగారు. అయిదు నిమిషాలు బైటే నిలబెట్టి ఏదో పెద్దరిటర్ను చెక్ చేయడం మొదలెట్టాడు. ఆనక రమ్మని సంజ్ఞచేశాడు.

"మరేం లేదూ, కొత్తధాన్యం నూర్పులైనట్టున్నాయి. ఓ రెండు బస్తాలు చవగ్గా కొని పెడతావనీ-

"ఊఁ" అన్నాడు శేఖరం.

"నువ్వు సేద్యం చేయిస్తున్నావు గనక ధరవర్లు మోసం లేకుండా తెలుస్తాయనీ-"

మళ్ళీ "ఊఁ" అన్నాడు శేఖరం.

"బస్తా ఇరవై ఒక్క రూపాయీ అయిదణాలట... నిన్న రేడియోలో చెబుతూంటే ఆఁహాఁ, అనుకున్నాను."

శేఖరానికి నవ్వొచ్చింది. ఆపుకుని "ఎన్ని బస్తాలు వేయించమంటారు, ఇంటికేనా?'

"ఆఁ ఇంటికే - అందాకా నాలుగు బస్తాలు వేయించు. ఆనక చూసుకుందాం" అన్నారు నారాయణగారు.

అనుకోడమే గాని రేడియోలో చెప్పినధరకి ఎవరైనా యిస్తారా? - తనే ఇవ్వాలి, తన దగ్గిరున్నాయనీ, చవగ్గా అంటే తనే ఇస్తాడనీ, తనకైతే డబ్బు ఇవ్వనే అక్కర్లేదనీ; కనీసం ఇప్పుడివ్వక్కర్లేదనీ తెలిసి అడిగారు. తెలుసుకొని నాలుగు బస్తాలు తోలించుకెళ్ళాడు శేఖరం.

ఓ నాడు "కర్రలైపో వొచ్చాయియీ, బజార్లో కర్రనమ్మకమైంది దొరకడం లేదుటా, శేఖరం గారి తోట్లోది వో మామిడిచెట్టో చింతచెట్టో కొట్టించమనూ, ధర లెక్క జూసుకుంటారు అయ్యగారు- అని నారాయణగారి భార్య కబురంపింది.

ధర లెక్క జూసుకోవడమంటే శేఖరానికీ, పద్మకీ తెలుసు.

అమ్మాయికి సమ్మంధం కుదుర్తే ఆంజనేయస్వామికి పాతిక కొబ్బరి కాయలు కొడతామని మొక్కుకున్నాం. శేఖరంగారింట్లో చెట్లకి వున్నాయేమో దింపించి తీసుకు రమ్మని మరోనాడు బంట్రోతు కబురూ.

చెట్టెక్కేవాణ్ణి వాడి నగల్తో సహా వెంటబెట్టుకు మరీ వొచ్చాడా బంట్రోతు.

"ఎవరింట్లోంచో తెచ్చిన కాయలు కొడితే మొక్కు చెల్లుతుందిటండీ?" అంది పద్మ -

ఆ వేళ శేఖరం ఫైల్సులో అన్నీ తప్పుడురాతలే. క్వార్టర్లీ ప్రోగ్రెస్ రిటర్ను చాటంత స్టేటుమెంటూ తప్పే. 'డైరెక్టరాఫీసుకి పంపవలసిన స్టేటుమెంటు అంత కొక్కిరి బిక్కిరిగా ఎవరన్నా తయారుచేస్తారా!'

నోరు మెదపలేదు శేఖరం, సంగతి గ్రహించి.

"చుట్టాలొచ్చారు; ఊళ్లో పాలు దొరకటంలేదు.' అంటూ చెంబుపట్టుకొస్తాడు బంట్రోతు. నారాయణగారి విధవక్కగారు రెండేసి రోజుల కోసారొచ్చి "బీరపాదు భలేకాసిందమ్మోయ్," అనో, "ఈ దొండబద్దు మా పెరట్లో వెయ్యమంటే వెయ్యరు." అనో "అబ్బ, ఏం బెండకాయలే, నవ నవలాడిపోతున్నాయ్," అనో అంటూ సజ్జాడు కూరలూ పట్టుకుపోతుంది.

"పిన్నిగారూ, సాయంకాలంపూట బంట్రోతు నోసారి పంపిస్తూ వుందురూ, నీళ్ళు పోస్తాడు పాదులికీ-" అంది పద్మ ఓ నాడు.

"ఆఁ, వాడికెక్కడ తీరుతుంది లేవేపిల్లా. తీరికున్నా ఆలంఖిణీ రానిస్తుందా? ఎంతసేపూ ఆఫీసుకీ ఇంటికీ తిప్పి చంపుతుంది వాణ్ణి. అయినా ఈ కాసింది చాల్లెద్దూ, నీకా, పిల్లా పీచూ లేరు. రోజుకి రెండు కాయలు చాలు మీ యిద్దరికీనీ; కాయకపోతే కొబ్బరికాయలుండనే వున్నాయ్. పప్పేసి ఒండుకుంటే కొబ్బరకాయలాటికూరేది?" అంటూ చక్కాపోతుందావిడ.

ఆవిడ ఈవిణ్ణి శూర్పణఖ అంటుంది. ఈ విడ ఆవిణ్ణి మండోదరి అంటుంది. ఈ అదునుచూసి పద్మ నారాయణ గార్ని రావణాసురుడంది.

ఇంట్లోంచి అన్నీ పట్టుకుపోవడంతో ఆగిపోతే బాగానే వుణ్ణు.

శేఖరానికి సుబ్బారాయుడని ఓ అన్న గారున్నారు. ఆయనహైస్కూల్లో మేష్టరు. శేఖరాన్ని 'టాకిల్' చేసికూతుర్నీ కొడుకునీ ఆయనదగ్గర డబ్బివ్వని ఏర్పాటుమీద ప్రయివేటుకి పెట్టారు నారాయణగారు. "పిల్లలు పైవాళ్ళంటే గొప్ప సిగ్గుపడుతున్నారోయి, ఆ సూర్యారావు మేష్టరు చూసేవా, అత నాడపిల్లల వేపు అదోలా చూస్తాడని మా అమ్మాయి కంప్లెయిన్‌చేస్తోంది. అందుకని మీ అన్నయ్యగారిదగ్గిర ఈ ఏర్పాటు నువ్వుచేస్తావని ... పోనీ వాణ్ణి ఇంకోచోటికి పంపుదామా అంటే అది వూరుకోదే; తమ్ముడు నాతోటే వుండాలంటుంది...!" అన్నారాయన. శేఖరం ఏదో అన్నాడు. అది ఆయనకి తందానతానే.

"శేఖరం, మీ నారాయణగారి కెంత జీతంరా?" అన్నాడు సుబ్బారాయుడు.

"నాలుగొందలిరవై."

"పిల్లలకి డబ్బిచ్చి ప్రయివేటు కూడా చెప్పించుకోలేడుట్రా ఆయన? ఏంచేస్తాడో జీతం అంతానూ? - ఛీ! ఇది మరీ అన్యాయంగా వుంది. ఏమిట్రా నువ్వింతలా లొంగిపోయేవూ; నాకు తెలీకడుగుతానూ?"

"ఏమిటో అన్నయ్యా- ఆ దిక్కుమాలిన గ్రహం నాతోటి సరిపెడుతుందనుకుంటే, మీ అందర్నీ పీక్కుతింటోంది -" అని విచారించాడు శేఖరం.

"అబ్బెబ్బే, నువ్వలా ఇదవకు... వెధవది నేనేంవీళ్ళకోసం వేరే శ్రమ పడక్కర్లేదుగా, వాళ్లిద్దరి క్లాసుల వాళ్లూ నాదగ్గిరున్నారు. వాళ్ళతో బాటే వీళ్లూ వుంటారు. దానికేముంది గానీ, ఊరికే సంగతడిగాను."

ఒక రోజున పద్మా, శేఖరం ఆలోచనలో పడ్డారు. ఉద్యోగం కోసం ఆయన దగ్గిరికి వెళ్లడం దగ్గిర్నుంచి ఇవాళ్టిదాకా మొగుడు వాళ్ళకే అంకితమైపోయి ఈ దిక్కుమాలిన నూట ఎనభై

రూపాయలకోసం ఇలా హైరాణాపడిపోయి దారిదోపిడీ అయిపోవడం పద్మకేమీ నచ్చలేదు. ఇంతకంటే దగ్గిరుండి సేరీచూసుకుంటే గడవకపోదు.

"నెల్లాళ్ళు సెలవైనా పెడుదురూ!" అంది పద్మ కొసకి.

"శేఖరం శెలవు నారాయణగారు రికమెండ్ చేశారు. అంతేగాదు. 'ఆర్డర్సు వొస్తాయన్న ఆశతో, అతన్ని రిలీవుకూడా చేశారు.

"చూడూ, చంటివాడికి హార్లిక్సు దొరకడంలేదు. మీ ఆవుని మా యింట్లో కట్టెయ్యించు, నువ్వెలాగా మీ అత్తారింటికి వెళతానంటున్నావు గనక - ఈ నెల్లాళ్ళూ పోయాక మళ్ళీ మీయింటికి తోలించుకుందువుగాని" అన్నాడు.

"ఆయి."

"మీ పాలికాపుతో చెప్పు; పెరటివేపు వేసే తాళం మా యింట్లో యిమ్మని. కొబ్బరి కాయలూ, కూరగాయలూ అవసరమైతే తీసుకుంటారు... ఊఁ?"

"అలా గేనండి."

✣ ✣ ✣

పుట్టింటికి వెళ్తే పద్మదే పైచెయ్యి.

ఆమె వాళ్ళ నాన్నగారితో అప్పుడూ, అప్పుడూ రావణాసురుడి దురంతాలు అన్నీ రిపోర్టు చేసేసింది.

నారాయణగారు లక్ష్మయ్యగారికి ఏదో దగ్గిర బంధువే. అయినా ఇందులో ఆయన కలగజేసుకునే దేం కనిపించలేదు. "పోన్లే; ఒనెల్లాళ్లపాటు తప్పుకున్నాడుగా; ఆనక చూసుకోవచ్చు.' ' అన్నాడాయన తాపీగా.

ఆయన కలగజేసుకోవచ్చు," అన్నాడాయన తాపీగా.

"ఏం తప్పించుకోడం నాన్నా! వారం రోజులు అయ్యేపోయిందా, ఇక ఇరవై రోజులుంది పట్టుమని. వెళ్ళీ వెళ్లగానే ఆవుని తోలమని కబురు చేశామనుకో: ఆయన, 'పిల్లాడికి ఆపాలుతప్ప మరో ఆవుపాలు నచ్చడంలేదోయి. రోజూ మరో చెంబుడు పాలు పంపిస్తూ వుండు' అంటూ తెల్లారేసరికి అర్థశేరు చెంబిచ్చి బంట్రోతుని తోల్తాడు. ఇహ అక్కణ్ణించీ ఆవూ పేడా మనవీ, పాలూ పెరుగూ వాళ్ళవీనూ," అంది పద్మ.

లక్ష్మయ్యగారు నవ్వారు, "ఆఁ, అలా ఎందుకవుతుంది గానీ -" అని.

"అయ్యో, నే చెప్తే నమ్మవు నాన్నా! ఆయన్నడుగు - మొహం వుంది, అద్దంవుంది! మధ్య నేనెందుకు? ఆయన దగ్గ రీయ నసలు మాటాడ్రు. ఓ సా రేమయిందనుకున్నావ్ మొదట పట్టుకెళ్లిన నాలుగుబిస్తాల ధాన్యానికీ డబ్బివ్వలేదని అక్కసుకొద్దీనూ రెండోసారి ధాన్యానికి కబురు రాగానే ఈయన్నో పక్కకి తోసేసి నేను ముందుకెళ్ళి, "ధాన్యం లేవుట, ధర మంచిదొస్తే అమ్మేశార్ట అని చెప్పవోయి," అన్నాను! ఆ తరవాత మూడు నాలుగు రోజుల్దాకా ఈయరాసిన కాయితాలన్నీ తప్పేట. అవేవో యకౌంట్లన్నీ తప్పుటా. రోజూ రాత్రి పదీపదకొండుదాకా ఆఫీసువర్కేట, అంది పద్మ గబగబా.

"అవునటోయ్?" అన్నారు లక్ష్మయ్య గారు, కూతురుకేసి తిరిగి నవ్వుతూ.

శేఖరం తీరుబాటుగా "ఆ పోనిస్తురూ, మీ అమ్మాయికన్నీ భూతద్దంలోంచి చూసినట్టవుపడ తాయి," అన్నాఢు.

"ఊరుకోండూరుకోండి. చెప్పుకోడానికి సిగ్గేస్తూం దనక ; ఇంకా ఇక్కడ కూడా ఆయన్ని వెనకేసుకురావడం ఎందుకూ? - నేనన్నదాన్లో ఒక్క అక్షరం అబద్ధంలేదు నాన్నా!" అంది పద్మ -

"వాడికిన్ని టేక్టిక్సు ఎలా వొచ్చాయియా అని చూస్తున్నాను. చిన్నప్పుడు స్కూల్లో అన్నీ జీరోలూ, బాడీగార్డులూ వొచ్చేవి. రోజూ ఇంటికిపోతూ అందరిచేతా తన్నులు తిని పోయేవాడు. అలాంటివాడు గూడా ఇంత గడుసుతనం నేర్చాడన్నమాట. -"

"అతనే కాదునాన్నా, వాళ్లింట్లో ఇంతపిల్లదగ్గిర్నించీనూ; వాళ్ళక్కయ్యగారు, వాళ్లావిడా, అందరూను, ప్రపంచం తల్లకిందులైపోయి, వీళ్లకి వుద్యోగాలు పోయినా సరే, దారిదోపిడీ చేసి బతికేస్తారు నాన్నా, వాళ్ళూ," అంది పద్మ.

"పోనీవోపని చెయ్యకూడదుటోయ్!"

"ఏంటండీ?"

"ట్రాన్స్ఫరుకి ఎప్లయి చెయ్యి-"

"అబ్బే-చెయ్యరండి."

"వీళ్లు చెయ్యనివ్వరనుకో-కాదు. హైద్రాబాద్ వెళ్ళి డైరెక్టరాఫీసులో నాకు తెలిసినత నున్నాడు, అతనిద్వారా ఏమన్నా సాధించుకోగూడదూ?"

శేఖరం ఆలోచిస్తున్నాడు.

అతను ఊఁఅనడేం, అని పద్మ ఆలోచిస్తోంది.

"ఏం? ఇష్టంలేదా? - ఆయన్ని వొదిలి వుండలేరు; నాకు తెలుసు."

"బ్బబ్బబ్బా - వుండు పద్మా - ఏమిటి మరీ చిన్నపిల్లవైపోతున్నావ్, అతన్ని ఆలోచించుకో నివ్వవూ? ఇప్పుడే బండెక్కేయ మంటావా యేమిటి? - భలేదానివే -"

✣ ✣ ✣

శేఖరం శెలవయిపోయింది. ఆర్డర్సురాకపోడాన్ని ఇంకా పాత ఆఫీసులోనే పనిచెయ్యవలి సొచ్చింది. ట్రాన్సురు కాయితాలు వొస్తాయని ఎదురుచూస్తున్నాడు. సుమారొక వారంరోజుల్దాకా నారాయణగారు దేనికీ కబుర్లు పెట్టడంలేదు. శేఖరం తను బదిలీకి దరఖాస్తు పెట్టుకోడం ఈయనకి తెలిసిందేమో అనుకున్నాడు. సెలవులో వుండడాన్ని ఆ దరఖాస్తు డైరెక్టరుగారాఫీసులో స్వయంగా ఇచ్చేశాడు. అదే డ్యూటీమీద వుంటే ఈయన ద్వారా వెళ్ళవలిసింది. ఈయన ఎలాగూ కానివ్వడు. ఇప్పుడు తన ట్రాన్సురు కాయితం ఈయనకి గాని రిఫర్ చేశారేమో అని ఓవిధంగా జంకుగాను వుంది; ఓవిధంగా మొండి ధైర్యమూవుంది. తను మునపట్లా వినయం చూపించడం లేదు. ఈ నాలుగు రోజులకీ మామూలుగా వుంటేనే మంచిదీ, అనుకున్నాడు శేఖరం. కాని ఏదో శక్తి అతన్ని పూర్వంలా వినయంగా ఉండనివ్వటంలేదు. తను డైరెక్టరుగారాఫీసులో చేసిన ఏర్పాటువల్ల అతనికి ఇహ నారాయణగార్ని లెక్కచేయవలసిన అవసరం లేకపోయింది. చేదామనుకున్నా చెయ్యలేక పోతున్నాడు.

ఓనాటి సాయంకాలం క్లబ్‌నించి ఇంటికొచ్చేసరికి పద్మ గొంతుబైటికి వినిపిస్తోంది. 'ఆవు ఉట్టి పోయిందోయ్, రాత్రి పూట అసలు ఇన్ని చుక్కలుకూడా ఇవ్వడం మానేసింది. ఆయనగారు తాగటానికి - చూశావుగా, ఇప్పుడే పావుశేరు పాలుపోసి వెళ్ళింది పాలమనిషి-' అంటోంది ఎవరితోటో.

వాడెవడో కాదు. "యమధర్మరాజు బంట్రోతు."

"అవునండమ్మగారు, చూసినాను," అంటూ వాడు మెట్లుదిగివెళ్ళిపోయాడు.

లోపలికి రాగానే "మళ్లీ ఏమిటి?"అన్నాడు శేఖరం.

"ఇంకేముందీ, మీ నారాయణగారి దాడి. పాలకోసం చెంబిచ్చి పంపాడు."

"పాలు కొన్నానంటావేమిటి నువ్వు?"

"ఆ నేనెందుకు కొంటానూ, నూనిమనిషివాడొచ్చేసరికి గుమ్మందిగి వెళ్తోంది. అదే పాలమనిషన్నాను. - మీ ఆర్డర్సేమన్నా వొచ్చాయా?"

కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిస్తూ పద్మ 'ఇవాళ మీరు రాసిన ఆఫీసు కాయితాలన్నీ తప్పేనా?' అన్నది.

ఇలా ఇంట్లో వాళ్ళకి ఆఫీసూ, ఆఫీసరుకి ఇల్లూ అర్థమైపోయి తను దిగమింగుకున్న సంగతులు మళ్ళీ మళ్ళీ చెప్పుకోడం శేఖరానికి చాలా అసౌకర్యంగానే వుంది. కాని ఏం చేస్తాడు! - ఇంకెన్నాళ్ళులే....

ఆరోజు వుదయం నారాయణ గారి పనిమనిషి 'కూరలేమన్నా వుంటే పంపమన్నారమ్మా' అంటూ వొస్తే దానికి దొడ్డంతా చూపించింది పద్మ. చూపిస్తూ "చూశావే గంగీ- నెల్లాళ్ళు తాళం యిచ్చామా, మనిషి వున్నాడుగదా; కాస్త చూడొద్దూ? కూరలు కాస్తే పట్టుకెళ్లమేగాని పాదులకి కొంచెం నీళ్ళు పొయ్యడమనీ, పశువులు కుమ్మకుండాచూడ్డమనీ వుండక్కర్లేదుటే? - ఓ నాడు తాళం వెయ్యకుండా వాళ్ళ బంట్రోతు వొదిలేశాట్ట, దొడ్లో దున్న పోతులు జొరబడి సర్వనాశనంచేసేశాయి. అనుకుందామంటే వల్లగాదు.ఇదుగో ఇల్లారా, బెండకాయలున్నట్టున్నాయి పట్టుకెళ్ళు." అంది.

బెండకాయలు మొత్తం ఎనిమిది వున్నాయి.

"ఇయిగోనమ్మా - ఇయి ఆరు మాత్రం ఏటిజేసుకుంతారమ్మా, గంపెడు సంసారం. మీరే ఏ పులుసులోనన్నా ఏసీసుకోండి," అని గంగమ్మ అవి అక్కడపోసింది. కాని పద్మ తీసుకోలేదు. "మావారు బజార్నించి తెస్తార్లేవే, పట్టుకుపో. దొడ్లోకూరలు మరో నాడు వొండుకు తిన్నామా ఏమిటీ?" అంటూ దానికే ఇచ్చేసింది.

ఆ మూడోనాడు నారాయణగారే శేఖరాన్ని కేకేసి "ఏమిటోయ్ విశేషాలు?" అన్నాడు.

"బ్బే, ఏముందండీ -" అన్నాడు శేఖరం.

"ప్రయివేట్లు చెబితే మేష్టర్లని శిక్షిస్తున్నారుటోయి."

"అలాగాండీ?"

"నువ్వీమధ్య మీ అన్నయ్యగార్ని కలవలేదుటోయి?"

"కనుక్కుంటానండి."

'కనుక్కోడం దేనికి లే - నిజంగానే ప్రయివేట్లు చెప్పనివ్వడంలేదుట, నేనూ విన్నాను '

"అయి."

"ఒహలాచేస్తే బావుంటుందేమో."

"ఎలాగండీ?"

"ఏదో ఈపరిక్ష లొకటి దగ్గరికొచ్చేయి గదూ, కంటిన్యూటీ తప్పించేస్తే పిల్లలు ఆ వొచ్చిన ముక్కలుకూడా మరిచిపోతారనీ - నువ్వేం అనుకోనంటే చెప్తాను."

"హెఁహెఁ. అనుకోడానికేముందండీ-"

"ఏం లేదు. నువ్వు పొద్దుటే వోగంట చెప్పి పోతూ వుండు - ఏవో ఎలిమెంటరీ మేథమెటిక్సు, అవేగా! చెప్పగలవనుకుంటాను."

"చెప్పలేక పోడమేంగానండీ-కొంచెం నేర్చుగోవాలి ముందర."

'ఏమిటోయి మరీ చెప్తావు, నిన్న మొన్న వొచ్చావు స్కూల్నించి, నాకేం జ్ఞాపకం లేదనుకున్నావుటోయ్, నువ్వుచదువుకోడం, ఉద్యోగానికి రావటం-అంతా నిన్న మొన్న గదుటోయ్?'

"ఏం నిన్న మొన్న సార్!?" ఉద్యోగం మూడేళ్లూ, కాలేజీస్టడీస్ నాలుగేళ్లూ మొత్తం ఏడేళ్లయిపోయిందండి ! ఇప్పుడిహ జ్ఞాపకం ఎక్కడలెండి. నేర్చుకోడమే మళ్ళీనూ, అందులో ఈ ఆఫీసుల్లో తల దూర్చినతరవాత మెదడు చిత్రిక పట్టినట్టు బల్ల పరుపుగా ఐపోయీ, మొద్దెక్కి పోతుందండీ."

"అబ్బ, అబ్బ -చాలా చెప్పావే!"

"పోనీ మీరంతగా చెబుతున్నారు గనక ప్రయత్నిస్తాన్లెండి. రెండుమూడు రోజులు."

"అలాగే కానీ -"

మొత్తంమీద ధైర్యంగానే మాట్లాడా ననుకున్నాడు శేఖరం. రేపట్నుంచీ పొద్దుటే వెళ్లాలిగాబోలు. ఎలాగేనా నారాయణగారు కార్యసాధకుడే, తన చేత అవుననిపించేడు. - ఏ మేనా ఇది ఎన్నాళ్ళో సాగనివ్వకూడదు. గుంట వెధవ లిద్దరికీ పెద్ద పెద్ద తెగని లెక్కలు ఇచ్చేసి ఏదో చదువుకుంటూ గడిపేస్తే సరి - ఎలా గేనా వాళ్లింటికెళ్లడం, అక్కడ భజనా యివి తప్పేటట్టులేవు. కానీలే! పదిలో పదకొండు.

"నువ్వేదో ట్రాన్సురుకి పిటిషను పెట్టినట్టున్నావు, మొన్న లీవులో వునప్పుడు, - ఆది రిటర్న్డై వచ్చింది. నాతో చెప్పలేకపోయావుటోయ్, నేను ముందే చెబుదునూ? కంపెనీ ఇంటరెస్టులో నిన్ను ఉన్న వూళ్లోంచి కదపరుగా!" అన్నారు నారాయణ గారు.

పిడుగుపడ్డం శేఖరం ఎప్పుడూ చూడలేదు. కాని ఇప్పుడీ వార్త అతనికిచ్చిన షాకు తగిలి పిడుగే జ్ఞాపకానికొచ్చింది.

వారంరోజుల బట్టీ నారాయణగారు చూసిన చూపులకి అర్థం బోధపడింది.

ఇప్పుడేం సాధనం? ఇహ ఈయన మామూలు దాడి నిరాటంకంగా జరుపు కుంటాడు. తను మునపట్లాగే సరఫరాలు చేస్తూ వుండాలి. చాలా అన్యాయంగా వుంది.

ఏదోచెప్పేసి క్లబ్బుకయినా వెళ్లకుండా యింటికొచ్చాడు.

"ఏమండీ ఆర్డర్సు వొచ్చాయా?" అంటూ ఎదురొచ్చింది పద్మ-

"ఏం ఆర్డర్సో పాడు - అంతా తారుమారైంది," అంటూ చతికిలపడ్డాడు శేఖరం.

"అలా నిరుత్సాహపడిపోతారేం, - వొక్కొక్కటే దాటుకొస్తున్నాంగా, వొస్తాయి లెండి వెధవార్డర్సు మరి నాలుగు రోజుల్లో, మనిష్టమా ఏమిటి," అని సముదాయించ బోయింది పద్మ.

శేఖరం మాట్లాడలేదు.

"నేనో తమాషా చేశాను;చెప్పనా?"అంది పద్మ-శేఖరం నిరుత్సాహంగా వుంటే ఆవిడికి తోచదు.

"తమాషాలాగానే వుంది. కాళ్ళు కడుక్కుందికి నీళ్ళియ్యి." అంటూ బూటుతీసి పంట్లాం విప్పుకొని లుంగీ చుట్టబెట్టుకున్నాడు శేఖరం.

"మన్న మధ్యాన్నం వుసుపోక మీ అన్నయ్యగారింటికెళ్ళి ఆయన్తో చెప్పాను- మేష్టరు ప్రయివేట్లు చెబితే పట్టుకుంటున్నారన్న నేపంతోటి ఆ నారాయణగారి పిల్లల్ని మానిపించేయమని. వాళ్ళని ఇవాళ నించీ రావొద్దని చెప్పేర్ట. వాళ్లు రావడం మానేశార్ట కూడాను," అని ఎంతో వుత్సాహంగా చెప్పింధి పద్మ -

"మా నేశారా, భలేవుపకారం చేశావు నాకు. ఇహరేపట్నుంచీ పిల్లల కా శ్రమే తప్పింది. నన్ను రోజూ వాళ్లింటికెళ్లి వోగంట చెప్పి పొమ్మన్నాడాయన," అన్నాడు శేఖరం. విసుగ్గా.

జరిగిందంతా విని పద్మ ఎంతో నొచ్చుకుంది. "పొరపాటుచేసి మీ మనస్సు కష్టపెట్టానండీ, ఏం చెయ్యమంటారు చెప్పండి, మీరు పడుతున్న బాధలు చూసి ఏదో చేద్దామనుకొని పప్పులో అడుగేశాను," అంది క్షమించమని అడగడానికేనా నోర్రాక.

"ఏం చేస్తాం? నువ్వూ నేనూ ఒక ర్నొకరు ఊరడించుకోడమే" అన్నాడు శేఖరం.

అంతకంటే అతనికీ తోచలేదు.

"మానేద్దురూ; దిక్కుమాలిన ఉద్యోగం!" అంది పద్మ.

శేఖరం మానదల్చుకోలేదు. "ఎలకలున్నాయని ఇల్లు కాల్చుకుంటామంటే వెర్రిదానా? ప్రతిఘటిస్తే బ్రిటిషువాడంతటివాడు పారిపోయాడు. ఎలాగేనా సాధించితీరతాను!" అన్నాడు.

వారం రోజులు పొద్దుటే 'ప్రైవేటు' కి వెళ్లాడు. కాని పిల్లలిద్దరికీ కూడా శేఖరం టీచింగు పనికిరాలేదు, నచ్చలేదు. వాళ్ళు తెలీదన్న లెక్కలు ఇతనికీ తెలిసేవి కాదు. ఇతనిచ్చే లెక్కలు వాళ్ల మేష్టారికేనా తెలిసేవికావు. గుంటూరు చాంతాళ్ళంతేసి పొడుగు సాగే లెక్కలూ ఇంగ్లీషు పాఠాన్ని ఇంగ్లీషులో చెప్పక తెలుగులో చెప్పేసే మేష్టారూ పిల్లలే అక్కర్లేదనేశారు. "మేం వేరేగా చదువుకుంటాం నాన్నా, ఇక వారంరోజులేగా!" అంది వాళ్ళమ్మాయి. ఓ రోజు సాయంకాలం.

ఆ సాయంకాలమే శేఖరం ఇంటికొచ్చేసరికి పద్మ హైదరాబాద్ నించొచ్చినవుత్తరం అందించింది. డబ్బంతాపోయి పనిజరగలేదు నిన్నేంచేస్తానో చూసుకో అని ఆ గుమాస్తామీద కోపంతో కవరు జోరుగాచింపి చూసుకున్నాడు.

"మీరు చెప్పిన ప్రకారం చేయించడానికి గాని, వెంటనే జాబురాయడానికిగాని, సావకాశం కుదరనందుకు చింతిస్తున్నాను. మీ పిటీషను చూసి డైరెక్టరుగారు మీ ఎపాయింట్ మెంటుషీటు పుటప్ చెయ్యమని ఆర్డర్సు వేశారు. ఆ ప్రకారం పుటప్ చేశాం. మరో వారంరోజులకి ఫైలు తిరిగొచ్చింది. మీరువున్నది మీ స్వగ్రామమనిన్నీ అందుచేత అక్కడే మీరు ఎక్కువ శ్రద్ధతో ఏ బాధాలేకుండా పనిచేస్తారనీ కంపెనీ ఇంటరెస్టు మనుషులచేత ఇబ్బందిలేకుండా సాధ్యమైనంత

ఎక్కువ పనిచేయించుకోడమే అనీ నోటురాసి పిటీషను తిప్పేయమని ఆర్డర్సు వేశారు. కాగాపోగా, మీకు ఏదో ఒకటి చెయ్యాలి గాబట్టి ఇలా చేస్తున్నాము.

మీ బ్రాంచి మేనేజరుగారు ఈమె పదిహేనవ తేదీ నించీ వాళ్లమ్మాయి పెళ్లికని శెలవుపెట్టారు. నెల్లాళ్ళు సెలవుగనక మరోమనిషిని ఎలాగూ వెయ్యాలని, మీ బ్రాంచి హెడ్డు గుమస్తా ధనంజయరావు గార్ని ప్రమోట్‌చేస్తూ నారాయణగారికి సెలవు మంజూరు చేయించాం. సెలవనంతరం నారాయణగారు జాయినవడానికి వారికిప్పుడిప్పుడే ఆర్డర్సు వేయించలేదు. అప్పటికి భద్రాచలంలో బోసుగారు రిటైరవుతారు. ఆయన స్థానే ఈయన్ని అక్కడ జాయినవమని ఆర్డర్సు అప్పుడు పంపే యేర్పాటు చేస్తాము. మీ రీ విషయం గుట్టుగా వుంచుకొని ఈ పదిహేనుదాకా నింపాదిగా గడిపివేయండి... మీ మామగార్నించి వుత్తరాలు లేవు- వెంటనే జాబు వ్రాయించండి.

మర్నాడు శేఖరం చాలా హుషారుగా నారాయణగారింటికి వెళ్లాడు. పిల్లలు వాళ్లే చదువుకుంటున్నారు, రోజూ తను పిలిస్తే తప్ప రాలేనివాళ్ళు-

శ్రీ నారాయణగారే పలకరించారు - "నీకు శ్రమెందుకని వాళ్లనే చదువుకోమన్నా నోయ్."

"అదేమండీ - ?"

"సెల్ఫుస్టడీ మంచిది. - చూడూ, అమ్మాయి పెళ్ళి రేపు ఇరవై రెండుని స్థిరపడింది; నీకు తెలుసుగా. - ఎక్కడా మంచి నెయ్యి దొరకడంలేదు. మనిషిని పంపిస్తాను; మీ మామగారికి వుత్తరంరాసి రెండు డబ్బాలు నెయ్యి జతపర్చమందూ! డబ్బు లెక్కజూసుకుందాం."

"ఎప్పటికండీ, ఇరవై రెండోతారీక్కా? ఓహ్! చాలా టైముందిగా! అప్పటిమాట చూసుకొవొచ్చు లెండి!" అని మరీ వుషారుగా ఇవతలికొచ్చాడు శేఖరం.

*

***('ఆంధ్రపత్రిక' వీక్లీ : 10-12-58)***

*With best compliments from*

Ph : 22744

# United Medical Stores
(Wholesale)

# United Medical Stores
(Retail)

# Jagannadh Medical Agencies.

**PHARMACEUTICAL DISTRIBUTORS**

**11-3-16**
**Sri Sai Nivas**
**Chinna Baratam Street**
**SRIKAKULAM - 532 001.**